

HAPPY BIRTHDAY
CBN
Sir


మా నాయకుడికి
జన్మదిన
శుభాకాంక్షలు
జనహృదయనేత, అలుపెరుగని పోరాట యోధుడు,
నిరంతర కృషీవలుడు, ప్రతి అడుగు ప్రజల కోసమే,
ప్రతి నిమిషం ప్రజాసేవకే అంకితం చేసిన మహనీయులు,
స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త, తెలుగు ప్రజల అభిమాన నాయకులు,
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాబోయే ముఖ్యమంత్రివర్యులు,
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ....
భాష్యం ప్రవీణ్
పెదకూరపాడు నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి

కూటమి గెలిస్తేనే రైతులకు మేలు





నకరికల్లు మండలం కంకలగుంట గ్రామంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు
- ఒక్క ఛాన్స్‌తో అందరినీ ముంచేశాడు
- మరోసారివస్తే ఇంకేం మిగలదు : కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, ఏప్రిల్ 19: ప్రతి ఏడాది సాగర్ జలాలు విడుదల కాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టీడీపీ, జనసేన, బీజేపీ నరసరావుపేట కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం రాత్రి నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో కలసి ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గోదావరి, పెన్నా నదుల అనుసంధానం ద్వారా ఏటా సాగర్ జలాలు అందుబాటులోకి రావటంతో పల్నాడుజిల్లా పాడిపంటలతో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. కుంకలగుంటకు రూ.40 లక్షలు జలజీవన్‌మిషన్ నిధులు విడుదలైనా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నా ఈ ప్రభుత్వం పని చేయించుకోలేక పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి రావటంతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని, 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బీసీలకు బీసీకార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వటంతోపాటు బీసీ రక్షణచట్టం అమల్లోకి తెస్తామన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందిస్తామన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ప్రత్యేకంగా ఎస్సీలకే కేటాయిస్తామన్నారు. టీడీపీ కష్టకాలంలో అండగా ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కోరుకొని మరీ నేను పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట నుంచి పోటీ చేస్తున్నట్లు, విజ్ఞులైన పల్నాడు ప్రజలు తనను, ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే దోపిడీ, విధ్వంసం, అరాచకాలకు అడ్రస్‌గా మార్చారన్నారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, డీసీల్, పెట్రోల్ ధరలనుపెంచి నిత్యవసర సరుకుల ధరలనూ పెంచారన్నారు. రాజధాని అభివృద్ధి, పోలవరం పూర్తి చేయటం, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం టీడీపీతోనే సాధ్యం అన్నారు. ప్రజలు తనను, ఎంపీగా లావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభాధ్యక్షునిగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య వ్యవహరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి స్థానిక సమస్యలను ఎంపీ, కన్నా దృష్టికి తీసుకు వచ్చారు. వీటన్నింటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, టీ వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో కన్నా, పక్కన బాజీ చౌదరి, శౌరయ్య, సాయికృష్ణ

కన్నా, లావులకు బ్రహ్మరథం

సత్తెనపల్లి నియోజక వర్గ కూటమి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు, నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలకు శుక్రవారం రాత్రి కుంకలగుంట ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో కన్నా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార వాహనంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కన్నాను, లావును గజమాలలతో పార్టీ శ్రేణులు సత్కరించారు. బాణసంచా పేలుస్తూ ఎన్నికల ప్రచార యాత్ర పండుగను తలపింప చేసింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో పార్టీ జెండాల రంగులతో, డప్పు వాయిద్యాలతో మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, ఘంటా జగదీష్ బాబు, వజ్రగిరి జయారాజు, బాదినేడు సుబ్బారావు, ఎం.సైదారావు, గోపు శ్రీనివాసరావు, సాతులూరి అప్పారావు, శ్రీను నాయక్, తాండ్ర వెంగళరావు, రుసుం కోటయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, యాళ్ళ శ్రీనివాస సాయి బాబా, సాగి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కుంకలగుంటలో చేరికలు ..

వైసీపీ నుంచి టీడీపీలోకి కుంకలగుంట ఉప సర్పంచ్ సింగరాజు అంకారావు, రామిశెట్టి ఈశ్వరయ్య, సింగరాజు చౌదయ్య, తాడికొండ సుబ్బారావులు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీ నేతలు సాదరంగా ఆహ్వానించారు. కుంకలగుంటలో శుక్రవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభతో టీడీపీ తరుపున పోటీ చేస్తున్న కన్నా, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు జోష్ పెంచింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రవేశపెట్టింది టీడీపీయే..

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు ఎనలేనివి
- అధికారంలోకి రాగానే అంబేద్కర్ విదేశీ విద్య పేరును పునరుద్ధరిస్తాం
- బీజేపీపొత్తుతో ముస్లింలు ఆందోళన చెందవద్దు
- డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



రేటూరు రోడ్ షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని పక్కన బీ. రామాంజనేయులు, తదితరులు

కాకుమాను, ఏప్రిల్ 19: రాష్ట్రంలో సంక్షేమాన్ని ప్రవేశపెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రేటూరు, అప్పాపురం, కాకుమాను గ్రామాలలో శుక్రవారం రోడ్ షోలతో పాటు, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు మహిళలు, స్థానికులు ఎదురేగి వెళ్లి స్వాగతం పలికారు.

తొలుత రేటూరులో రోడ్ షోలో చర్చి వద్ద బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడా విదేశాల్లో విద్యనభ్యసించారని తెలిపారు. హక్కుల పోరాటాల నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. స్ఫూర్తి ప్రదాత విగ్రహాల వలన ప్రేరణ పొంది సమాజానికి మంచి చేయాలని స్థానికులకు సూచించారు. అమరావతి రాజధానిలో 125 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతి వనాన్ని చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని నిర్వీర్యంలో చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు విదేశాలలో విద్యనభ్యసించాలనే ఉద్దేశ్యంతో అంబేద్కర్ విదేశీవిద్య పేరుతో వారికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ విదేశీ విద్య పేరును తొలగించారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 2 లేదా 3 సెంట్ల ఇళ్ల పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం మసీదు వద్ద జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఆందోళన చెందవద్దన్నారు. బీజేపీతో పొత్తు అవసరం గురించి వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్డీయే అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి అభ్యర్థిగా భారతరత్న అబ్దుల్ కలాం ఆజాద్ పేరును సూచించి ఆయన గెలుపుకు పాటు పడ్డారన్నారు. అధికార వైసీపీ పార్టీ నుంచి గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు, రషీద్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం అప్పాపురంలో జరిగిన రోడ్డు షోలో స్థానిక బొడ్డురాయి సెంటర్ వద్ద జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ గ్రామాలలో తాగు, సాగు నీరు సమస్యలు ఉన్నాయని చెప్పారు. సాగు నీరు సమస్యకు సీఎం జగన్ పరోక్షంగా కారకుడని తెలిపారు. రైతులకు సాగుకు, ప్రజల త్రాగు నీరు, వాడుక నీరు అవసరాల గురించి పాలకుడికి అవగాహన లేకపోతే కొమ్మమూరు కెనాల్ ప్రక్క గ్రామాలకు కూడా నీటి ఎద్దడి ఏర్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్‌ల గురించి ప్రజలు అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్‌లో చాలా ప్రమాదాలు అని స్థానికులకు వివరించారు. మద్యంపై, ప్రజల ఆస్తులపై తాకట్టు పెట్టారని వివరించారు. ఉమ్మడి ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం జగన్‌కు కక్ష సాధింపు చర్యల రాజకీయాలకు తప్ప అభివృద్ధి తెలియదని అన్నారు. వలంటీర్‌ల ద్వారా ప్రజల డేటాను స్వీకరించారని తెలిపారు. ఆ డేటా ఎవరి వద్ద ఉందో కూడా తెలియని పరిస్థితికి జగన్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు అగస్టీన్, రాంగోపాల్, వీరయ్య చౌదరి, నువ్వుల సునీల్ చౌదరి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారు

- ఎమ్మెల్యే అనుచరులేనని బాధితుడి ఆరోపణ



భూమి డాక్యుమెంట్‌లను చూపిస్తున్న సూర్యనారాయణ

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 19: ఉప్పలపాడు వద్దగల తన రెండెకరాలను ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని నరసరావుపేట మండలం లింగం గుంట్లకు చెందిన చంద్రా సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని జగనన్నకాలనీ సమీపంలోని కబ్జాకుగురైన తన భూమిని, డాక్యుమెంట్ చూపించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులైన బండి వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి తన భూమిని అక్రమించారన్నారు. కర్నూలు-గుంటూరు హైవే పక్కనే ఉన్న ఆ భూమి విలువ ఇప్పుడు రూ.15 కోట్లు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఈ మధ్య ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కలిసి భూమి వివరాలు అందజేశానని, ఆయన నాకు ఏమి సంబంధం లేదని చెప్పారన్నారు. ఎమ్మెల్యేని కలిసిన తర్వాత తన భూమిలో షెడ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము విజయవాడకు చెందిన వారి వద్ద కొన్నాం.. ఎమ్మెల్యే అనుచరుడైన నరసింహారెడ్డి మాట్లాడుతూ తాము ఉప్పలపాడు వద్ద ఆ భూమిని విజయవాడకు చెందిన వారివద్ద కొన్నామని ఫోనులో వివరించారు. సూర్యనారాయణ స్థానికుడు కావడంతో విజయవాడ వాళ్ళను భూమిలోకి రాకుండా చేయడానికి ఏవేవో చెబుతున్నారని, అతని వద్ద ఎలాంటి డాక్యుమెంట్‌లు లేవన్నారు.

అతిసారతో మంచం పట్టిన మంచాల

- కలుషిత నీటితో ప్రబలిన డయేరియా
- ఏ గృహానికి వెళ్లిన బాధితులే
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థులలో ఆగ్రహం



చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్19: చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో అతిసార ప్రబలింది. గ్రామంలో సుమారు 50 మందికి పైగా బాధితులు ఉన్నారు. గ్రామంలో కలుషిత నీరు వల్ల అతిసార ప్రబలిందని ప్రజలు ఆరోపించారు. గత రెండు రోజులుగా అతిసార విజృంభిస్తుంటే వైద్యాధికారులు కానీ, అధికారులు కానీ ఆ గ్రామం వైపు కన్నెతి చూడని పరిస్థితులు నెలకొన్నాయి. రెండు రోజుల క్రితం పదుల సంఖ్యలో ప్రజలు స్వల్ప లక్షణాలతో బాధపడటం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం 50 మంది వరకు ఆసుపత్రి పాలు కావటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కలుషిత నీరే డయేరియా ప్రబలటానికి కారణం అన్ని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం అతిసారా బాధితులు పెరిగిపోవటంతో వైద్యాధికారులు ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామంలో 35 మంది వరకు ఇంటి వద్దనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఎనిమిది మందికి వ్యాధి తీవ్రత పెరగటంతో చేబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం..

మంచాల గ్రామంలో అతిసార బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం అని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మంచాలను డీఎం అండ్ హెచ్‌వో సందర్శించారు. అతిసార వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేయించిన్నట్లు చెప్పారు. అత్యవసర చికిత్స కోసం తరలించటానికి వీలుగా అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉండి పరిస్థితి చక్కపడే వరకు నిరంతర పర్యవేక్షణ చేయనునట్లు డీఎం అండ్ హెచ్‌వో తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, బీసీ సంక్షేమం సంఘం ప్రతినిధులు

అన్నివర్గాల మద్దతు కూటమికే..

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 19: ఏ వర్గాన్ని వదిలి పెట్టకుండా అందరినీ అన్నిరకాలుగా సీఎం జగన్ రెడ్డి వేధింపులకు గురిచేశాడని, ఆ బాధిత వర్గాలందరూ ఇప్పుడు కూటమికే మద్దతు పలుకుతున్నారని మాజీ మంత్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో ప్రత్తిపాటిని ఆంధ్రప్రదేశ్ బీసీసంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలు, ఎస్సీలపై జరుగుతున్న దాడుల నియంత్రణ కోసం ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏకు మద్దతుగా ఉంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని వారు శాలువాతో సత్కరించారు. అనంతరం పుల్లారావు బీసీనేతలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాన్యుడికి కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిని సీఎం జగన్‌రెడ్డి కల్పించారన్నారు. ప్రజలను అవస్థల పాలుచేస్తూ, వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూన్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి అక్రమ సంపాదనతో

జగన్‌రెడ్డికి డబ్బులు ఉన్నాయి కదా? అని సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లల్లో సర్వేలు వేయించుకోవటం తప్ప వాస్తవ సర్వేలన్నీ ఏకపక్షంగా టీడీపీ కూటమి గెలవబోతుందని చెపుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో ఏ సర్వే చూసినా కూటమికి 20కి పైగా లోక్‌సభ సీట్లు వస్తాయని స్పష్టం చేస్తున్నాయన్నారు. అలాగే 160 అసెంబ్లీ సీట్లు గెలిచే స్థాయికి కూటమి ఖాయంగా కన్పిస్తోందన్నారు. రైతులు, యువతకు ముఖ్యమంత్రి తీరని ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఏమీ అమలు కాలేదన్నారు. చేయూత బటన్ నొక్కినట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నా ఎవరి ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. విద్యా దీవెన డబ్బులు పరిస్థితి కూడా అదే అన్నారు. ఇన్నిచేసి అబద్ధాలు, మోసంతో పొద్దుబుచ్చుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపటం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. వైసీపీ దోపిడీ పర్వంలో 175 నియోజక వర్గాల్లో చిలకలూరిపేట, ఇక్కడి అవినీతి మంత్రి మొదటి స్థానంలో ఉంటారన్నారు. అనంతరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ మాట్లాడుఏతూ బీసీల అభ్యున్నతి కోసం చంద్రబాబు, పవన్ పాటు పడుతున్నారని, జగన్ బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినా నిధులు, విధులు లేకుండా చేశారని దుయ్యబట్టారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని, వారిపై దాడులు జరగకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీ రక్షణ చట్టం తెస్తామన్నారు. కేంద్రంలో ప్రధానిగా బీసీ కులానికి చెందిన మోదీ ఉన్నారని, రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి పాల్పడే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉన్నారని, బీసీలు, మైనార్టీలు వారిని ఆశీర్వదించాలని రాజా రమేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి భానుగుంట్ల శ్రీనివాసరావు, నియోజక వర్గ అధ్యక్షులు కాకుమాను రమేష్, జిల్లా నాయకులు వెంకటరావు, కూరపాటి శివ శంకర్, పట్టణ అధ్యక్షుడు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల హల్‌చల్

- టీడీపీ డీజేపై పెట్రోలు పోసి నిప్పంటించే యత్నం

బెల్లంకొండ, ఏప్రిల్ 19: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలపై ప్రతిఘటించటంతో ఘర్షణ తగ్గుముఖం పట్టించింది. విషయం తెలుసుకున్న బెల్లంకొండ ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించి బాధితుడిని చంద్రాజుపాలెం వైసీపీకి చెందిన గాదె నాగార్జునరెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇరువర్గాలను పిలిపించి బైండోవర్ చేస్తానని ఎస్‌ఐ రాజేష్ పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు బెల్లంకొండ పోలీసు స్టేషన్‌కు వద్దకు చేరుకొని టీడీపీకి చెందిన డీజేపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అరుణాచలంనకు ప్రత్యేక బస్సులు

గుంటూరు, ఏప్రిల్ 19: ఈనెల 23న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్‌సలాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 21న రాత్రి 9.15 గంటలకు బయ ల్దేరి 22న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజురాత్రి అక్కడే బసచేసి 23న పౌర్ణమిరోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. ఆరోజే సాయంత్రం బయల్దేరి 24న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుంద న్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. చార్జీ ఒక్కరికి రూ.2420 ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం 73828 97459 నంబరును సంప్రదించాలని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం కోరారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల్లో గందరగోళం

- ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల విధానం గందర గోళంగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో రూల్ చెబుతూ ఉండటంతో దరఖాస్తు దారులు విస్తుపోతున్నారు. గత ఎన్నికల్లో ఎక్కడ విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు ఓటు ఉన్న నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు ఇస్తే ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయించేవారు. కానీ ఇప్పుడు అధికారులు చెబుతున్నది చూస్తే ఇందుకు భిన్నంగా వినపడుతుంది. ఏ నియోజకవర్గంలో ఓటు ఉన్నా పని చేస్తున్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఇవ్వాలని, వాటిని స్క్రూటినీ చేసి ఆయా నియోజకవర్గాలకు పంపిస్తారని మళ్ళీ అక్కడి నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను పని చేస్తున్న నియోజకవర్గానికి పంపుతారని, ఓటు వేశాక వాటన్నిటిని మళ్ళీ ఓటు ఉన్న నియోజకవర్గానికి పంపించే విధానాన్ని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడ తప్పు జరిగినా దరఖాస్తు దారు ఓటు హక్కు కోల్పోతారు. కొన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగి ఏ జిల్లాలో పని చేస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గంలో ఓటు ఉంటే దరఖాస్తు తీసుకుంటుండగా మరి కొన్ని నియోజకవర్గాల్లో తిరస్కరిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఏ నియోజకవర్గంలో ఏ నిబంధన అమలవుతుందో తెలియడం లేదంటూ వాపోతున్నారు. ఎన్నికల అధికారులు దీనిపై దృష్టి సారించి ఓటు ఉన్న నియోజకవర్గంలోనే పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు తీసుకుని అక్కడే పెసిలీటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు

టీడీపీలోకి వైసీపీ మాజీ ఎంపీటీసీలు

దాచేపల్లి, ఏప్రిల్ 19: గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో నారాయణపురంకు చెందిన మాజీ ఎంపీటీసీలు, వడ్డెర కార్మిక నాయకులు శుక్రవారం టీడీపీలో చేరారు. నారాయణపురం మాజీ ఎంపీటీసీ పల్లపు వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు విష్ణుమూర్తిలు, నడికుడి గ్రామానికి చెందిన వడ్డెర కార్మిక నేతలు, వడియ రాజుల సామాజికవర్గానికి చెందిన పల్లపు కృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శంకరశివ, మోహన్‌రావు, నరసింహారావు, గురవారావు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, తమ్మిశెట్టి శంకరరావు, శ్రీనుబాబు, ముదిరాజులకు చెందిన వెంకటేష్, మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరారు.




టీడీపీలో చేరిన కౌన్సిలర్ చంటీశ్వరి వెంకట నారాయణ తదితరులు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : పట్టణంలోని 2వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ ఎం.చంటీశ్వరి వెంకట నారాయియణ శుక్రవారం వైసీపీని వీడి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. భార్యభర్తలు ఇద్దరికి కన్నా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కన్నా లక్ష్మీనారాణ వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, దేవతి శివ ప్రసాదు, నూర్‌బాషా జానీబాబు, గుంటూరు ఆశీర్వాదం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌రెడ్డి దెబ్బకు రోడ్డున పడ్డాం

- ఐదేళ్లపాటు అబద్ధాల కోరు పాలనే.. • 1585వ రోజుకు ఆందోళనలు..



వెంకటపాలెంలో ధర్నా శిబిరంలో మహిళలు ఆందోళన

తుళ్ళూరు, ఏప్రిల్ 19: జీవనాధారమైన తమ భూములు రాజధాని అమరావతి కోసం ఇస్తే.. సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానుల మూడుముక్కలాట దెబ్బకు రోడ్డున పడ్డామని 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతి రాజధానిని కొనసాగించాలంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు శుక్రవారం నాటికి 1585వ రోజుకు చేరుకున్నాయి. అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్ర ప్రగతిని దెబ్బతీసే వైసీపీని ఈ ఎన్నికలల్లో ఇంటికి పంపాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

77,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 67,994 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 77,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,032 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	15500
273	10000	14000
341	8000	17500
4884	11000	15500
సూపర్ 10	9000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00



వినుకొండ అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థిగా జీవీ ఆంజనేయులు, మాచర్ల అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డిలు శుక్రవారం ఆయా ఆర్‌వో కార్యాలయాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. అంతకముందు ఇరువురు నాయకులతో కలిసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఎటువంటి ఆర్భాటం లేకుండా ఆర్‌వలోకు నామినేషన్లు అందజేశారు. - వినుకొండ, మాచర్ల



బీ మాయ!



కేంద్రం ఇచ్చే 50 శాతం వాటా ఇప్పుడు లేనప్పటికీ దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్తి ఖర్చు రాష్ట్రమే భరిస్తూ ఉచిత బీమా అమలు చేస్తోంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయి నిస్సహాయ స్థితిలోని నిరుపేద కుటుంబాలకు ఆలంబనగా జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ వైఎస్సార్ బీమా..! - ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్సార్ బీమాపై చెప్పిన మాటలు... కానీ ఆచరణ అందుకు పూర్తి విరుద్ధం గా వుంది. ప్రీమియం చెల్లించని కారణంగా అనేక మంది కార్మికులు ఈ పథకానికి దూరమ య్యారు. కరోనా బారినపడి చనిపోయిన వందలాది కుటుంబాలకు ఈ పథకం వర్తించ లేదు. అందుకు కారణం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి బీమా పథకానికి ప్రీమియం చెల్లించకపోవడమే!

- తండ్రి పేరు పెట్టి చంద్రన్న బీమాకు కొర్రీలు
- పూర్తిగా నీరుగారిన కార్మిక సంక్షేమ పథకం
- 5 లక్షల నుంచి 2 లక్షలకు పడిపోయిన లబ్ధిదారులు
- ఐదేళ్లుగా పెండింగులో క్లెయిమ్‌లు 11 కోట్ల బకాయిలు
- మహిళలకు పూర్తిగా మొండిచేయి చూపిన ప్రభుత్వం

గుంటూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అతిపెద్ద కార్మిక సంక్షేమ పథకం చంద్రన్న బీమా! ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరు కార్చేసింది. ఈ పథకానికి తన తండ్రి పేరు పెట్టుకున్న ముఖ్యమంత్రి ఆ పేరుకు నష్టం వాటిల్లుతుందన్న జంకు కూడా లేకుండా కార్మికులను వంచించారు. పథకంలో ఎక్కడికక్కడ కొర్రీలు పెట్టి పథకాన్ని పూర్తిగా నీరుగార్చేశారు. చంద్రబాబు హయాంలో బీమాపై ధీమాతో వున్న కార్మికులు ఇప్పుడు ధీమా కరువై ఆందోళన చెందుతున్నారు.

నయవంచన..

టీడీపీ హయాంలో చంద్రన్న బీమా పథకం కింద సాధారణ మరణం అయితే యాభై ఏళ్ల వయస్సు ఉన్నవారికి రూ.2 లక్షలు, 50 ఏళ్లకు పైబడి 59 ఏళ్ల వయస్సు వారికి రూ.30 వేల బీమా పరిహారం అందించారు. కుటుంబంలో ఎవరు చనిపోయినా పరిహారం ఇచ్చేవారు. ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్సుతో సంబంధం లేకుండా వర్తింపజేశారు. రెండు నెలల్లోపే పరిహారం పంపిణీ చేశారు. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక పథకం కుచించుకుపోయింది. 2021 వరకూ పథకం ఊసే ఎత్తకపోవ డంతో అప్పటి వరకూ పథకం అమలులో లేకుండా పోయింది. ఫలితంగా 2019- 21 మధ్య కాలంలో చనిపోయిన, అందునా కరోనా కాలంలో చనిపోయి సర్వస్వం కోల్పోయిన కష్టజీవులకు ఈ పథకం వర్తించలేదు. దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాగా 2021-22లో వైఎస్సార్ బీమా కింద పథకాన్ని అమలు చేసినా అది ఏమాత్రం ఉపయోగం లేనిదిగా మారిపోయింది. 18- 50 ఏళ్ల ఉండి సంపాదించే వ్యక్తి సహజ మరణం చెందితే ఆ కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించారు. 18- 70 ఏళ్ల మధ్య ఉండి సంపాదించే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలి.

మట్టి ఖర్చులూ ఇవ్వడం లేదు

బాధితులు మృతి చెందిన రోజునే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు చెల్లించాల్సి ఉంది. నెలలు గడిచినా ఇవ్వడం లేదు. ప్రమాద మరణాలకు సంబంధించి ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికెట్, పోస్టుమార్టం నివేదిక ఉంటేనే పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రహదారి ప్రమాదాల్లో చనిపోతే డ్రైవింగ్ లైసెన్స్ నిబంధన కచ్చితం చేశారు. ఈ కారణంతో ఏటా వేలాది మందికి బీమా అందడం లేదు. కాగా కుటుంబ పెద్దలకు మాత్రమే పథకం వర్తిస్తుందన్న నిబంధన కారణంగా ఒకే కుటుంబంలో పనిచేసే ఇతర కార్మికులకు ఈ పథకం వర్తించడం లేదు. ఒకే ఇంట్లో భార్యాభర్తలుంటే పథకం భర్తకు మాత్రమే వర్తిసుండగా మిగిలిన కుటుంబ సభ్యులకు వృధా అవుతుంది.

వేలాది క్లెయిమ్‌లు పెండింగ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 14లక్షల 91వేల 412 మంది వైఎస్సార్ బీమా కింద నమోదై వున్నారు. వారిలో 10లక్షల 21వేల 371 మంది మాత్రమే అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. మిగిలిన 3 లక్షల 96వేల మందిని ప్రభుత్వం అనర్హులుగా చేసింది. కాగా 2019 నుంచి ఇప్పటి వరకూ 18,032 క్లెయిములు నమోదవగా, వాటికి సంబంధించి ఇప్పటి వరకూ 8,313 క్లెయిములకు మాత్రమే ప్రభుత్వం పరిహారం చెల్లించింది. మిగిలిన క్లెయిములు ఇప్పటికీ పెండిం గులోనే వున్నట్లుగా తెలుస్తోంది. కాగా బీమా క్లెయి ముల విషయంలో ప్రభుత్వం, అధికారులు గోప్యతను ప్రదర్శిస్తున్నారు. క్లెయిముల వివరాలు డాష్‌బోర్డులో పెట్టకుండా జాగ్రత్త పడుతున్నారు. 2020- 24 మధ్య కాలానికి సంబంధించిన క్లెయిముల వివరాలు బయట కు రాకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. కాగా జిల్లాలో 6,878 క్లెయిములు పెండింగులో వున్నాయని, వాటి తాలూకు కార్మికులకు రూ.11 కోట్ల వరకు పరిహారం అందాల్సి వుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.



దగా మామ!

- తలనూనె, సబ్బులకు డబ్బులు ఇవ్వలేదు..
- వసతి గృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మోటిక్ ఛార్జీలు
- నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు
- ఈ లోగా పిల్లలకు డబ్బు చెల్లించేనా ?



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. గిరిజన, బీసీ, ఎస్సీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండేది అధికంగా పేద పిల్లలు. తాము పడుతున్న కష్టం తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో కిలో మీటర్ల మేర దూరంతో ఉన్న వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు, ఇతరత్రా చేతి ఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇస్తుందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిన దుస్థితి. నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈ లోగానైనా పిల్లల డబ్బు చెల్లింస్తారో లేదో?

వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలను జమచేయాలి. జూన్ నెలలో వసతి గృహాలు ప్రారంభమైతే రెండు నెలలకు సదరు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిది నెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది వారి తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు నెలలు తరబడి కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆశ్రయిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల బాలికలకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదు. 2019 వరకు కాస్మోటిక్ కిట్‌లను బాలికలు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపి వేయడం గమనార్హం.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

వర్షం నీటిని ఒడిసిపట్టాలి

- నిర్దేశించిన లక్ష్యాలపై దృష్టి సారించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శివశంకర్ ఆదేశాలు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 19: నైరుతి రుతు పవనాల్లో కురిసే వర్షం నీటిని నీటి కుంటల ద్వారా ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ ఎంపీడీవోలను ఆదేశించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంపై శుక్రవారం కలెక్టర్ చాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. అమృత్ సరోవర్, మినీ అమృత సరోవర్, నీటి కుంటల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. లక్ష్యాలను చేరుకునే విధంగా పనులు చేపట్టాలని, ఉత్సాహవంతులను ఎంపిక చేసి వారి ద్వారా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాలపై దృష్టి సారించి పురోగతి సాధించాలన్నారు. ఒక్కొక్క నీటి కుంట నిర్మాణానికి ఎన్ని రోజులు పడుతుంది, ఎంతమంది కూలీలు అవసరం అవుతుంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి సంరక్షణ పనులను మే 3 వారం నాటికి పూర్తి చేయాలన్నారు. అటవీ ప్రాంతానికి సంబంధించి కుంటల ఏర్పాటులో అటవీ, డ్వామా అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించి జిల్లాలో మరిన్ని ఎకరాల్లో పంటలతో పాటు మునగ సాగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ఇంటింటికీ.. తాగునీరు ఏది?



2016 మే 2న మాచర్లలో జరిగిన కరువు ధర్నాలో జగన్‌మోహన్‌రెడ్డి (పాత చిత్రం)

ఐదేళ్లైనా నెరవేరని జగన్ హామీ

- మాచర్లలో తాగు, సాగునీటి తిప్పలు
- ఎన్నికలకు ముందు ఎన్నెన్నో వాగ్దానాలు
- కలగా మిగిలిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణం
- నిధులు కేటాయించకుండా వరికపూడిశెలకు శంకుస్థాపన



మాచర్లటౌన్, ఏప్రిల్ 19: సాగునీటి ప్రాజెక్ట్ పూర్తి చేసి మాచర్లను సస్యశ్యామలం చేస్తాం.. నీటి కరువు లేకుండా ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాం.. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి తెస్తాం.. పాలిటెక్నిక్, పీజీ కళాశాల, మండలానికి ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తాం.. అంటూ 2019కు ముందు వైసీపీ అధినేత ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత ఐదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచారంలో వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పూర్తి చేసి పల్నాట సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తానని జగన్ హామీఇచ్చారు. అయితే గెలిచిన నాలుగేళ్ల తర్వాత ముఖ్యమంత్రి హోదాలో 2023 నవంబరు 15న వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి మాచర్లలో శంకుస్థాపన చేశారు. ఎన్నికల ఏడాదిలో శంకుస్థాన చేసినా నిధులు కేటాయించలేదు. నియోజకవర్గంలోని గిరిజన తండాలు, రోడ్డు వసతి లేని సుదూర ప్రాంతాల్లో ప్రజల కోసం మాచర్ల పట్టణంలో వంద పడకలు ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హోదాలో మాచర్లలో వరికపూడిశెల శంకుస్థాపనకు వచ్చిన సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే ఈ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగినా, ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడినా సొంత డబ్బులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసుకుని నరసరావుపేట, గుంటూరుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వరుసగా నాలుగు సార్లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించారు.. అంతా మేలు చేస్తానన్న హామీలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తమను మోసం చేశారని ప్రజలు మండిపడుతున్నారు.

కరువు ధర్నాలో ఇచ్చిన హామీ ఏమైందో

2016 మే 2న మాచర్ల పురపాలక సంఘం కార్యాలయం వద్ద జరిగిన కరువు ధర్నాలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఖాళీ బిందెలను నెత్తిన పెట్టుకుని రింగురోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఆ సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తే మాచర్ల నియోజకవర్గంలో పట్టణంతోపాటు పల్లెలకు కూడా ఇంటింటికి కుళాయిల ద్వారా కృష్ణా నది జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. 2022 జనవరి 4న బుగ్గవాగు మంచినీటి పథకానికి పురపాలక సంఘ మంత్రి సురేష్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలతో శంకుస్థాపన చేయించారు. ఫైర్ స్టేషన్ పక్కన వాటర్ ట్యాంకు కోసం గోతులు కూడా తీశారు. ఏమి జరిగిందో తెలియదు కానీ కాంట్రాక్టర్ పనులు పునాదిలోనే ఆపివేసి పారిపోయాడు. నిర్మాణ సామగ్రి వెనక్కు వెళ్లిపోయింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, పట్టణాల్లో కూడా తాగునీరు అందక ప్రజలు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు.



వరికపూడిశెల పనుల శంకుస్థాపనలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి (పాత చిత్రం)



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు

- ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరిక
- దుర్గి మండల గ్రామాల్లో పర్యటన.. పోలింగ్ కేంద్రాల తనిఖీ

దుర్గి, ఏప్రిల్ 19: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, అత్యుత్సాహంతో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ధర్మవరం, జంగమహేశ్వరపాడు, ముటుకూరు, ఆత్మకూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. జంగమహేశ్వరపాడులోని పోలింగ్ బూత్‌లో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే స్వేచ్ఛ ఉందన్నారు. ప్రశాంతమైన పల్లెల్లో అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని, నేతల ఉచ్చులో పడి హింసకు పాల్పడవద్దని భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలైన జంగమహేశ్వరపాడు, ఆత్మకూరుపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. 100 శాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట గురజాల డీఎస్పీ పల్లపురాజు, సీఐ చినమల్లయ్య, ఎస్ఐ కోటయ్య, సిబ్బంది ఉన్నారు.

అతిసారతో మంచం పట్టిన మంచాల

- కలుషిత నీటితో ప్రబలిన డయేరియా
- ఏ గృహానికి వెళ్లినా బాధితులే
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తులలో ఆగ్రహం

సీఎం జగన్‌రెడ్డి దెబ్బకు రోడ్డున పడ్డాం

- ఐదేళ్లపాటు అబద్ధాల కోరు పాలనే..
- 1585వ రోజుకు ఆందోళనలు

6లో..

నా భూమిని ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారు

- బాధితుడి ఆరోపణ


నగరేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న బ్రహ్మారెడ్డి

ఓట్లు.. పాట్లు

- గ్రూపులు కడదాం.. ఓట్లు కొల్లగొడదాం...!
- గంపగుత్త ఓట్లపై నేతల దృష్టి
- వివిధ సంఘాల సమావేశాలతో నేతల బిజీబిజీ
- వాట్సాప్ గ్రూపుల అడ్మిన్‌లపైనా గురి
- వారి కోర్కెలకు జై కొడుతున్న పార్టీలు


బాపట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు వాట్సప్ గ్రూపులను కూడా వదలడం లేదు. అడ్మిన్లకు గాలం వేస్తూ ఓట్లు పోగేసుకునే పనిలో ఉన్నారు. ఇంకోవైపు ఆయా సంఘాల నేతలను, అపార్ట్‌మెంట్ల కమిటీలను, వివిధ అంశాల ఆధారంగా ఏర్పడిన సంఘాలుగా కూడా వదలడం లేదు. వారితో నేతలు బేరసారాలు సాగిస్తున్నారు. మరికొంతమంది ఇదే అదనుగా ఈవెంట్ మేనేజర్ల అవతారమెత్తుతూ గ్రూపుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఇంత చేస్తున్నా నేతలకు వారి ఓట్లు తమకే పడతాయన్న భరోసా కలగడం లేదు. దానికి ఒక్కటే కారణం ఈ రోజు తనతో సమావేశమయిన వారే మరో రోజు ప్రత్యర్థి పార్టీతో మంతనాలు జరుపుతున్నారు. అయినా సరే పదిమంది ఉన్న గ్రూపులను కూడా వదలకుండా వారి ఓట్లు కొల్లగొట్టడమే ధ్యేయంగా నేతలు ముందుకు సాగిపోతున్నారు.

యువకులకు డిమాండ్..

కొంచెం యాక్టివ్‌గా ఉండే యువకులు వారి వీధిలో ఉండే మరికొంతమందితో కలిసి ఓ గ్రూప్ ఏర్పాటు చేసుకుని రోజువారీ విషయాలు దానిలో పంచుకోవడం సహజమైపోయింది. ఇప్పుడు ఆయా గ్రూపుల అడ్మిన్‌లకు డిమాండ్ పెరిగింది. గ్రూపులో ఉన్న వారందరి మద్దతు తనకే దక్కేలా చేయాలని నేతలు అభ్యర్థిస్తుంటే క్రికెట్ కిట్ల దగ్గర నుంచి మోటార్ల బైక్‌ల వరకు సదరు యువకుల కోర్కెల చిట్టా నడుస్తోంది. వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు ద్వారా తల్లి దండ్రుల చేత చీవాట్లు తిన్న యువకులే నేడు నేతలకు ఓట్ల మారాజులుగా కనబడుతున్నారు. సమయం వారిది మరీ.

వ్యాపార సంఘాలు, కుల సంఘాలు...

చిరు వ్యాపారులు మొదలుకుని బిజినెస్ టైకూన్‌లుగా విరాజిల్లుతున్న వారంతా వారివారి వర్గీకరణలతో సంఘాలు నిర్వహిస్తూ ఉన్నారు. ఇదే విధంగా కుల సంఘాలు సైతం తమ తమ అంశాలపై పోరాటం చేస్తూ ఉన్నాయి. ఇప్పుడు నేతలందరికీ వీరు కావాల్సిన వారయ్యారు. వీరే కాదు చివరికీ చిట్టీపాట దారులను కూడా వదలకుండా ఓట్లనీ గంపగుత్తగా పడాలని నేతలు అభ్యర్థించడం వారి పాట్లకు అద్దం పడుతోంది.



సమీకరించడం తేలిక.. పెద్ద సంఖ్యలో ఓట్లు...

ఇంటింటీ ప్రచారాల కన్నా కూడా ఇలా సంఘాలు, గ్రూపులతో సమావేశాలు నిర్వహించి ఓట్లు అడగడం వల్ల పని తేలికవుతుంది. పెద్ద సంఖ్యలో ఓట్ల జల్లు కురిసే అవకాశం ఉంది. కానీ ఒక్కటే బెంగ నేతలకు పాపం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయనే. సమావేశాల కోసం మినీ హాలును వెతకాలి, విందుభోజనం ఏర్పాట్లు చేయాలి, వారి డిమాండ్లను సావధానంగా ఆలకించాలి. వాటిని నెరవేర్చాలి. ఇన్నీ చేసినా ఆ గ్రూపుల ఓట్లు తమకే పడతాయన్న భరోసా మాత్రం నేతలకు చిక్కడం లేదు పాపం.

రోజుకో పార్టీతో సమావేశం...

ఓ పార్టీ నేత ఓ గ్రూపుతో సమావేశమయ్యారని తెలుసుకున్న వెంటనే తెల్లారేసరికి మరో నేత అక్కడ వాలిపోతున్నారు. ఇదే అదనుగా వారు నిండైన డిమాండ్ల చిట్టాతో సదరు నేతను ఇదే అదనుగా ఆహ్వానిస్తున్నారు. అంతకు ముందు వచ్చిన పార్టీ నేతకన్నా అన్ని విషయాల్లో మెండుగా తాను చూసుకుంటానని హామీ ఇవ్వడంతో పాటు గ్రూపులు, సంఘాల వరాలు తీర్చడానికి నేతలు సన్నద్ధమైపోతున్నారు.

ఎవరినీ వదలడం లేదు....

ఇంటింటీ ప్రచారం జోరుగా చేస్తూనే ఈ గ్రూపులు, సంఘాలనూ వేటినీ వదలడం లేదు. చివరికి పది ఓట్లు ప్రభావితం చేసే శక్తి కలిగిన వారిని కూడా వదలకుండా వారితో విందుభోజనాలు ఏర్పాటు చేసి మరీ నేతలు ఓట్లపాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో వారు ఏ కోర్కె ముందుపెట్టినా అన్నింటికీ సై అంటున్నారే తప్ప సాధ్యాసాధ్యాల గురించి ఆలోచనే లేదు. పగలు ఊళ్లలో ప్రచారాలు, రాత్రిళ్లు గంపగుత్త ఓట్లపై గురిపెట్టి రహస్య సమావేశాలు ఇలా సాగుతోంది నేతల ఓట్ల వేట.

నమ్మకం చిక్కడం లేదు...

వాట్సాప్ గ్రూపులు, ఆయా సంఘాల నేతలతో ఎడతెరిపి లేకుండా సమావేశాలతో నిర్వహిస్తున్నా నేతలకు ఓట్ల విషయంలో గురి కుదరకపోవడంతో కంటిమీద కునుకు కరువవుతోంది. వారితో ఓ వైపు బేరసారాలు ఆడుతూనే మరో వైపు వారిని ఇంకాస్త గట్టిగా ప్రభావితం చేయగలిగే వ్యక్తుల కోసం దుర్భిణీ వేసి వెతుకుతున్నారు. అప్పటికీ ఓటు విషయంలో ఉపశమనం లభించకపోతే చేతిలో చెయ్యి వేసి సంఘాల నేతలతో చెప్పించుకుని కులాసాగా మరో గ్రూపువైపు అడుగేస్తున్నారు నేతాశయులు.

కలిసొచ్చే కారులో వచ్చి నామినేషన్

- పలు ఆలయాల్లో బ్రహ్మారెడ్డి ప్రత్యేక పూజలు
- మాచర్లలో ర్యాలీలకు అనుమతి ఇవ్వని పోలీసులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 19: ర్యాలీ.. ఆర్భాటాలు లేకుండా కలిసొచ్చే కారులో వచ్చి శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా శుక్రవారం జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. బ్రహ్మారెడ్డి తన సతీమణి శోభారాణితో కలిసి తొలుత పట్టణంలోని ఆంజనేయస్వామి, నగరేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నామినేషన్ వేసేందుకు ఉదయం 10:20 గంటలకు ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్‌కు తన నామినేషన్ సమర్పించారు. మాచర్ల అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ వేసే సమయంలో విద్యాధరణి మురళికి చెందిన ఏపీ 39 ఆర్‌జీ 1555 నంబరు కారులో వెళ్లి నామినేషన్ వేస్తే కలిసొస్తుందని నమ్మకం. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాలుగు దఫాలుగా మురళికి చెందిన ఈ నంబరు కారులో నామినేషన్ వేయడం, గెలవడం కూడా జరిగింది. అయితే ఈ దఫా మురళి పీఆర్కేతో విభేదించి టీడీపీలో చేరారు. ఈ క్రమంలో తన వాహనాన్ని మురళి నామినేషన్ సందర్భంగా జూలకంటి బ్రహ్మారెడ్డికి అందజేశారు. దీంతో కలిసొచ్చే మురళి కారులో వచ్చిన బ్రహ్మారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి చిరుమామిళ్ల మధుబాబు, న్యాయవాది గాలీబు, తోట వీరాంజనేయులు ఉన్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

ప్రధాన అభ్యర్థులు ఒకే రోజు నామినేషన్ వేసేందుకు రావడంతో గురజాల డీఎస్పీ పల్లపు రాజు నేతృత్వంలో శుక్రవారం పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. పార్కు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. అభ్యర్థుల ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. ఒక్కో అభ్యర్థికి ఐదుగురిని మాత్రమే అనుమతి ఇవ్వడంతో వారు మాత్రమే వచ్చి నామినేషన్ వేశారు.

ఒక్కసారే మహిళకు అవకాశం

- మాచర్ల నుంచి అసెంబ్లీకి వెళ్లిన దుర్గాంబ
- 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1999లో టీడీపీ అవకాశం

రెంటచింతల, ఏప్రిల్ 19: మాచర్ల నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికం.. కానీ ఇక్కడ మహిళకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఇప్పటి దాకా 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1999లో టీడీపీ అధినేత చంద్రబాబు మహిళకు అవకాశం ఇచ్చారు. దీంతో మాచర్ల నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచిన జూలకంటి దుర్గాంబ అసెంబ్లీలోకి అడుగుపెట్టింది. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చేప్పే రాజకీయ నేతలు మహిళలకు అవకాశం ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు. అసెంబ్లీలోకి అడుగుపెట్టేలా అతివలకు టిక్కెట్ల కేటాయింపులో చిన్న చూపు చూస్తున్నారన్న విమర్శ ఓటర్ల నుంచి వస్తోంది. మాచర్ల నియోజకవర్గానికి ఇప్పటి దాకా అంటే 1955 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 1999లో అప్పటి సీఎం చంద్రబాబు జూలకంటి దుర్గాంబకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించి ఆమెను చట్టసభల్లోకి అడుగుపెట్టేలా చేశారు. 1999 సెప్టెంబరులో నరసరావుపేటలో బాంబు పేలుళ్ల సంభవించడంతో అప్పటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏడు అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికలను వాయిదా వేశారు. అక్టోబరు 5న ఎన్నికలు నిర్వహించగా తుమ్మకోటలో పోలీసు కాల్పులు, అడిగొప్పలలో డీకే అరుణ భర్త భరత్‌సింహారెడ్డిపై దాడులు జరిగాయి. ఆ ఎన్నికల్లో 1951 ఓట్ల మెజార్టీతో దుర్గాంబ పిన్నెల్లి లక్ష్మారెడ్డిపై గెలిచారు. ఈమే ప్రస్తుత మాచర్ల నుంచే పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డికి తల్లి కావడం విశేషం. మాచర్ల నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల 2,60,556 మంది. వీరిలో మహిళల సంఖ్య 1,32,783, పురుషుల సంఖ్య 1,27,751. అంటే 5032 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.


జూలకంటి దుర్గాంబ


మాజీ మంత్రి ఆనందబాబును కలసిన యడవూరు వలంటీర్లు

టీడీపీకి వలంటీర్ల మద్దతు

అమృతలూరు, ఏప్రిల్ 19: మండలంలోని యడవూరు గ్రామానికి చెందిన పది మంది వలంటీర్లు తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారు. గ్రామానికి చెందిన వీరు తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో పనిచేయాలని నిశ్చయించుకుని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబును శుక్రవారం కలిశారు. టీడీపీ - జనసేన కూటమి గెలుపొందేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు ఆనందబాబుకు తెలిపారు. వీరి వెంట పార్టీ నాయకులు కుర్రా లక్ష్మీనారాయణ, బొంతా ఆంజనేయులు ఉన్నారు.

బంపర్ మెజార్టీతో అధికారంలోకి

- ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసి జీవీ జోస్యం

వినుకొండ, ఏప్రిల్ 19: రాష్ట్రంలో బంపర్ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం.. 150 నుంచి 160 మంది ఎమ్మెల్యేల బలంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణాస్వీకారం చేస్తారు.. వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు జోస్యం చెప్పారు. ఎన్‌డీఏ కూటమి నేతలతో కలిసి ఆయన శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్వోను కలిసి ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అంతకముందు ఆయన సతీమణి లీలావతితో కలిసి పట్టణంలోని పాత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ పల్నాడులో ఫ్యాక్షన్ పగలు చల్లారాలన్నా, కరువు సీమకు పచ్చతోరణం కట్టాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఇందుకోసం జిల్లాలో ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు నరసరావుపేట లోక్‌సభ స్థానంలో తమ అభ్యర్థులను ప్రత్యర్థులు ఊహించని ఆధిక్యాలతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు నాగ శ్రీనురాయల్, మేడం రమేష్, న్యాయవాది రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఎంలు.. ఇక్కడి వారే..

- ముఖ్యమంత్రులను అందించిన వేమూరు గడ్డ

వేమూరు, ఏప్రిల్ 18: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు నియోజకవర్గం ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన గడ్డగా గుర్తింపు పొందింది. కృష్ణానది ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఉద్దండ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారే కొణిజేటి రోశయ్య, నాదెండ్ల భాస్కరరావులు. వేమూరు పేరు తలవగానే వీరిద్దరూ గుర్తుకొస్తారు.

- వేమూరు వాసి అయిన కొణిజేటి రోశయ్య గ్రామ పంచాయితీ వార్డు మెంబర్‌గా రాజకీయాల్లోకి అరంగ్రేటం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున 1968, 1974, 1980లలో శాసన మండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. తొలిసారిగా మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో రోడ్డు రహదారుల శాఖ, రవాణాశాఖల మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత అనేక ముఖ్యమంత్రుల మంత్రి వర్గాల్లో పలు కీలకమైన శాఖలు నిర్వహించారు. 2004-2009కాలంలో 12వ శాసన సభకు చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నిక అయినప్పటికీ 2009ఎన్నికల ముందు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండా శాసన మండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలిలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉన్న రోశయ్య 2009సెప్టెంబర్ మూడు నుంచి 2010 నవంబర్ 24వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2011 ఆగస్టు 31న తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. 2016ఆగస్టు 30వరకు తమిళనాడు గవర్నర్‌గా తనదైన సేవలు అందించారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా, బాధ్యతలు నిర్వహించడమే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను 15సార్లు శాసన సభలో ప్రవేశపెట్టిన ఘనతను సాధించారు. 1995-1997 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 1998లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాజశేఖర్‌రెడ్డి మృతి చెందడంతో 2009సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఆయన 14నెలలు అధికారంలో కొనసాగిన తరువాత 2010లో నవంబర్ 24న తన పదవికి రాజీనామా చేశారు. 2007లో ఆంధ్ర విశ్వవిద్యాలయం రోశయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకులు వెంకయ్యానాయుడు రోశయ్యను స్వర్ణకంకణంతో సత్కరించి అభినందించారు.

- వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామానికి చెందిన నాయుడు నాదెండ్ల భాస్కరరావు వృత్తిరీత్యా న్యాయవాది. 1978శాసన సభ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి శాసనసభ్యుడిగా అయ్యాడు. 1978నుంచి 1989వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులుగా కొనసాగిన కాలంలోనే మంత్రిగా క్యాబినెట్ మంత్రిగా ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి మంత్రి వర్గంలో టి.అంజయ్య మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. 1998ఖమ్మం నియోజకవర్గం నుంచి 12వ లోక్‌సభకు ఎన్నికై పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు 1982మార్చి 29న నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రామారావు మంత్రి వర్గంలో నాదెండ్ల భాస్కరరావు క్యాబినెట్ హోదా కలిగిన ఆర్థిక మంత్రిగా ప్రమాణం చేశారు. రామారావు ప్రభుత్వాన్ని గద్దె దించి గవర్నర్ సహకారంతో నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యారు. నాటి కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ల అప్రజాస్వామ్య వైఖరితో రాష్ట్రం అట్టుడికింది. ఫలితంగా సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రిగా తప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. తిరిగి రామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.


కొణిజేటి రోశయ్య


నాదెండ్ల భాస్కరరావు

5 నుంచి పోస్టల్ బ్యాలెట్

ప్రతి ఉద్యోగి వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ సూచన

నరసరావుపేట, ఏప్రిల్ 19: ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ స్వీకరిస్తామన్నారు. ఏ నియోజకవర్గానికి ఎన్ని పోస్టల్ బ్యాలెట్లు వెళ్తున్నాయి, ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పోస్టల్ బ్యాలెట్ వివరాలపై త్వరితగతిన నివేదికలు అందించాలన్నారు. ఎన్నికల విధుల్లో రవాణాకు ఇబ్బంది కలగకుండా బస్సులను ఉపయోగించుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో వినాయకం, వివిధ శాఖలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్

రెండో రోజు.. 14 నామినేషన్లు

రెండో రోజు జిల్లాలో మొత్తం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం మంచి రోజుగా భావించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు అసెంబ్లీ స్థానాలకు 12, లోక్‌సభ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలు చేశారు. వినుకొండ, మాచర్ల, గురజాల, నరసరావుపేట అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, వైసీపీ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఆర్‌వోలకు సమర్పించారు. జిల్లాలో రెండు రోజుల్లో లోక్‌సభ స్థానానికి నాలుగు, అసెంబ్లీ స్థానాలకు 23 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు.

విన్నింగ్.. టెన్షన్

- హమ్మయ్య అంటూ.. అతి స్వల్ప ఓట్లతో గెలిచారు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్ని ఓట్ల మెజార్టీతో గెలిచామన్నది కాదు.. ఎన్నికల్లో గెలిచామా లేదా అన్నదే ముఖ్యం. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల జాతకాలు అతి స్వల్ప ఓట్లతో తారుమారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లతో పలువురు నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో కేవలం 12 ఓట్ల తేడాతో టీడీపీ ఎమ్మెల్యే సీటును కోల్పోయింది. టీడీపీ అభ్యర్థి గంజి చిరంజీవిపై ఆళ్ల రామకృష్ణారెడ్డి 12 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి వెన్నా లింగారెడ్డి 80 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1994 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మాలెంపాటి వెంకట నరసింహారావుపై కాంగ్రెస్ అభ్యర్థి సోమేపల్లి సాంబయ్య 131 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇదే నియోజకవర్గంలో 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పత్తిపాటి పుల్లారావుపై స్వతంత్ర అభ్యర్థి మర్రి రాజశేఖర్ 212 ఓట్ల అధిక్యతతో గెలుపొందారు.

1999లో గురజాల నియోజకవర్గంకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుపై కాంగ్రెస్ అభ్యర్థి జంగా కృష్ణమూర్తి 131 మెజార్టీతో గెలుపొందారు. 1978 ఎన్నికల్లో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గలో జేపీ పార్టీ అభ్యర్థి ముప్పలనేని శేషగిరిరావుపై కాంగ్రెస్(ఐ) అభ్యర్థి కోన ప్రభాకర్‌రావు 189 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 1962 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి దామినేని యజ్ఞ రంగారావుపై కాంగ్రెస్ అభ్యర్థి చేబ్రోలు హనుమయ్య 358 ఓట్లతో గెలుపొందారు. 1972లో పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మను అనంతరావు యలవర్తిపై దొప్పహూడి రంగారావు 432 ఓట్ల అధిక్యతతో గెలుపొందారు. 1978 ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గం నుంచి జేపీ పార్టీ తరఫున పోటీ చేసిన కొడాలి వీరయ్యపై కాంగ్రెస్(ఐ) అభ్యర్థి యడ్లపాటి వెంకట్రావు 506 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇలా అతి తక్కువ ఓట్ల తేడాతో ఎన్నికల్లో ఓటమి చెందారు.


టికెట్.. వెతుక్కుంటూ వచ్చింది..

- గాంధీభవన్‌లో బయోడేటా ఇచ్చారంతే..
- నాడు చదలవాడ జయరాంబాబుని వరించిన అదృష్టం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో ఉన్న గాంధీభవన్‌లో బయోడేటా ఇచ్చి వస్తే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఖరారైంది. ఆయనే చదలవాడ జయ రాంబాబు. ఇటీవలే స్వర్గస్తులయ్యారు. బయో డేటా ఆధారంగా సమాచారం తెప్పించుకొని టిక్కెట్ ఖరారు చేసే నాటి రాజకీయ పరిస్థితులు ఏ విధంగా ఉండేవో కళ్లకు కడుతున్నాయి. నేడు బయోడేటాకు బదులు పార్టీకి ఎన్నో రూ.కోట్లు సమర్పించుకొంటేనే సీటు గురించి ఆలోచన చేయాలి. 1985లో ఎన్టీఆర్ హవా బాగా సాగుతున్న రోజులవి. అంతకు ఏడాది ముందు 1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం కాంగ్రెస్ గాలి వీచింది. ఏపీలో మాత్రం ఎన్టీఆర్ హవా సాగింది. 1985 అసెంబ్లీ ఎన్నికలకు ఏపీలో కాంగ్రెస్ సీటు అడిగేవారు కరువయ్యారు. అప్పట్లో గుంటూరు-2 టికెట్ కోసం తన బయోడేటాను మాజీ ఎమ్మెల్యే, దివంగత చదలవాడ జయరాంబాబు గాంధీభవన్‌లో ఇచ్చి గుంటూరుకు వచ్చేశారు. బయోడేటా ఆధారంగా ఏఐసిసి సర్వే చేసింది. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టిన జయరాంబాబుకు కాంగ్రెస్‌లో క్లీన్ ఇమేజ్ ఉన్నది. వాటి ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం అయనకు టికెట్ ఖరారు చేసింది. సౌమ్యుడు, నిజాయితీపరుడిగా పేరున్న జయరాంబాబు 1985, 1989 అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు-2 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో టీడీపీ అభ్యర్థి చల్లా వెంకట కృష్ణారెడ్డి చేతిలో ఓడిపోయారు.

1985లో రూ.2.5 లక్షలు మాత్రమే ఎన్నికల ఖర్చు..

పార్టీ మొదటి సారి టికెట్ ఇచ్చిన తరువాత 1985లో రూ. 2.5 లక్షలు ఖర్చైనట్లు జయరాంబాబు జీవించి ఉన్నప్పుడు తరచుగా చెబుతుండేవారు. ఏఐసీసీ రూ.10వేలు పార్టీ ఫండ్‌గా ఇచ్చింది. మిత్రులు, బంధువులు, చందాల రూపంలో మరో రూ.2 లక్షలు సమకూర్చారు. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ గాలిని తట్టుకుని అసెంబ్లీకి ఎన్నికయ్యారు జయరాంబాబు. ప్రస్తుతం ఏ పార్టీ నుంచైనా అసెంబ్లీ, లోక్‌సభకు టికెట్ కావాలంటే ఎన్నెన్నో పైరవీలు చేయాలి. అసెంబ్లీ సీటు కోసం, సీటు వచ్చిన తర్వాత గెలుపు కోసం రూ.కోట్లలో ఖర్చు చేయాల్సిందే. రాజకీయాల్లో నైతిక విలువలు లేవని, గెలుపే ప్రధానంగా అక్రమ పద్ధతులకు పాల్పడుతున్నారని ఆయన తన జీవితం చివరి రోజుల్లో ఆవేదన వ్యక్తం చేస్తుండేవారు. గుంటూరు -2 నుంచి 1985, 89, 94ల్లో వరుసగా మూడుసార్లు పోటీ చేసి 2 సార్లు గెలిచి ఒక సారి ఓడిన జయరాంబాబుకు మూడుసార్లు ఎన్నికలకు అయిన ఖర్చు రూ.20 లక్షల లోపు మాత్రమే. ప్రస్తుతం ఈ మొత్తాన్ని ఒక వార్డు మెంబర్ ఖర్చు పెడుతున్నారు.



పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

అహంకారానికి... ఆత్మగౌరవానికి మధ్య పోరాటం

● వైసీపీలో ఎమ్మెల్సీగా ఎన్నో అవమానాలు పడ్డాను

● అధికారం, డబ్బు ఎప్పటికీ శాశ్వతం కాదు : ఎమ్మెల్సీ జంగా

దాచేపల్లి, ఏప్రిల్ 19: 'ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ అధ్యక్షుడిగా వున్న నన్ను వైసీపీ వారు ఎన్నో రకాలుగా అవమానించారు. నా సొంత గ్రామంలో నాకు తెలియకుండా సభలు నిర్వహించారు. వైసీపీ వ్యవస్థాపక సభ్యులలో నేనొక డిని, అయినప్పటికీ అధికారం, డబ్బు చూసుకొని నన్ను అన్నిరకాలుగా అవ మానించారని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దాచేపల్లిలోని విజయభాస్కర కల్యాణ మండపంలో గురజాల నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావే శానికి బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి బాలయ్య అధ్యక్షత వహించారు. బహుజన సమాజ్‌పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి నాగెండ్ల యోబు పరిరక్షణలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ 'నేను ఈ ఐదేళ్లలో మీ చెప్పుడు మాటలు వినలేదనా, మీ సంచులు మోయలేదనా.. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. ఇప్పుడు నేను చేస్తున్న పోరాటం అధికారం కోసమో, డబ్బు కోసమో చేయడం లేదు. నా ఆత్మగౌరవం కోసం, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం చేస్తు న్నాను' అని అన్నారు. రాష్ట్రం అనేక విధాలుగా నష్టపోయిందని, రాజధానిలేని రాష్ట్రంగా మారిందని, మళ్లీ రాష్ట్రం గాడిన పడాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందితేనే పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం బాగుపడుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, పోతుల కనకరాజు, మాతంగి సత్యా నందం, ఓర్సు ప్రేమరాజు, జక్కుల వీరస్వామి, నల్లమోతుల రాజు, ముశ్యం శ్రీనివాసరావు, గద్దల వేదమణి, బాలాజీనాయక్, మేకల సాంబశివరావు, గుండాల మల్లేశ్వరి, కొండలు, ఖాశింసైదా, నడికూడి వెంకటేశ్వరరావు, బొంబో తుల శ్రీనివాసరావు, అంజి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న జంగా ..

మాచవరం : మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. గంగా భవాని అమ్మవారు, గణపతి స్వామి, పోతురాజు స్వామి, నాగదేవత శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

మద్యం తరలింపుపై నిఘా

● నెల్లూరు సెబ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు

పిడుగురాళ్ల, ఏప్రిల్19: ఎన్నికల సందర్భంగా మద్యాన్ని తరలిస్తున్న ఘటన లపై సెబ్ అధికారులు ఎక్కడికక్కడ నిఘా వేయడంతో పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసుకోవాలని నెల్లూరు సెబ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ కే.హేమంత్ నాగరాజు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల సెబ్ స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, అనధికార మద్యం విక్రయాలు, మద్యం నిల్వల ప్రాంతాలను గుర్తించి తనిఖీలు చేయడంతోపాటు పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సెబ్ సీఐ సూర్యనారా యణను ఆదేశించారు. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేసి మద్యం తరలింపును కట్టడి చేసేలా తగిన ప్రణాళికతో వుండాలని హేమంత్ నాగరాజు అధికా రులను ఆదేశించారు.సమావేశంలో ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారితో గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీలోకి భారీగా చేరికలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 19: పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాలకు చెందిన పలు సామాజికవర్గ నేతలు శుక్రవారం గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. దాచేపల్లిలోని పలు వార్డులకు చెందిన షేక్ రజాక్, పఠాన్ సైదా, పల్లెపోగు శ్యాము, షేక్ సుభాని, చల్లా వెంకటేశ్వర్లు, ఖాశింసైదా, పందిటి సాయి దుర్గారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లుతో పాటు పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన మరికొందరు టీడీపీలో చేరారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైసీపీ నుండి టీడీపీలో చేరికలు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో వైసీపీకి చెందిన సుమారు 14 మంది శుక్రవారం యరపతినేని రమేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. నల్లమేకల పుల్లయ్య, నల్లమేకల శ్రీను, సత్యనారాయణ, తాటికొండ వెంకటే శ్వర్లు, తాటికొండ నాగేశ్వరరావు, కట్టెబోయిన కోటేశ్వరరావు, ఓర్సు చినవెంక య్య, మంజుల పుల్లారావులకు రమేష్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బడిగుంచల వెంకటేశ్వర్లు, యడ్లపల్లి రామా రావు, పుసులూరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డి సమక్షంలో చేరికలు ..

వెల్దుర్తి : మండలంలోని రామచంద్రాపురంతండాకు చెందిన వైసీపీ నేతలు శుక్రవారం ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు

● రూ. లక్షల వ్యయంతో ప్రభుత్వాస్పత్రి నిర్మాణం

● ఆనాడు ఆర్భాటంగా రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే కాసు

● కనీస వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా వైద్యశాల

దాచేపల్లి, ఏప్రిల్ 16: లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వాస్పత్రిని ఎంతో ఆర్భాటంగా ప్రాంభించిన ప్రభుత్వం అనం తరం దాన్ని గాలికి వదిలేసింది. ప్రారంభోత్సవం తర్వాత ఆస్పత్రి తలుపులకు వేసిన తాళాలు ఇప్పటి వరకు తీసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన ఆ ఆస్పత్రి ఆ లక్ష్యం నెరవేరకుండానే మూలన పడినట్లయింది.

దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపయోగంగా ఉంది. వైద్యులు, వైద్యసిబ్బంది నియామకం, ఆస్పత్రికి కావలసిన కనీస సౌకర్యాలైన కరెంటు, మంచినీరు, ఇతర మౌలిక వసతులు వంటివి కల్పించిన దాఖలాలు లేవు. ఆస్పత్రి నడికుడి గ్రామానికి చివరగా ఉండటంతో ఆకతాయిలకు, మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఎంతో ఆర్భాటంగా ఆస్పత్రిని ప్రాంభించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆ తర్వాత ఆస్పత్రి మొఖం చూసిన పాపానపోలేదు. విద్యుత్ మీటరు లేకుండానే విద్యుత్‌ను వినియోగించడంతో సరఫరాను తొలగించినట్లు ఆయా శాఖ అధికా రులు చెబుతున్నారు. వైసీపీ నాయకుల ఆర్భాటాలకు, ప్రచారాలకు మాత్రమే అభివృద్ధి పనులు పరిమితమయ్యాయనిగ్రామస్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. దాచేపల్లిలో నూతనంగా ప్రారంభించిన మరో ఆరోగ్య కేంద్రం పరిస్థితి కూడా ఇదేవిధంగా వుంది. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అత్యుత్సా హంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మార డంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైద్యసిబ్బందిని, మౌలిక వసతులను కల్పించి ఆస్పత్రిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నడికూడి గ్రామ శివారులో నిర్మించిన ప్రాథమిక వైద్యశాల

వైసీపీ కంచుకోట బద్దలు

● జంగమహేశ్వరపురంలో టీడీపీలోకి భారీగా చేరికలు

● సాదరంగా ఆహ్వానించిన యరపతినేని, ఎమ్మెల్సీ జంగా



జంగమహేశ్వరపురంలో ఎన్నికల ప్రచారంలో యరపతినేని, జంగా

గురజాలటౌన్, ఏప్రిల్ 19: వైసీపీ కంచుకోట బద్దలైంది. మొదటి నుంచి వైసీపీకి అండగా ఉన్న జంగమహేశ్వరపురంలో చీలికలు వచ్చాయి. సుమారు 40 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు వీరికి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న యరపతినేనికి ఘన స్వాగతం లభించింది. అడుగడుగునా పూలవర్షం, యువత కేరింతలు నడుమ మహిళలు హారతులు పట్టారు. యరపతినేని ఎన్నికల ప్రచారం గ్రామంలో పండుగ వాతావరణం తెచ్చింది. ముందుగా గురజాల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో భారీగా చేరికలు జరిగాయి. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 200 వైసీపీ కుటుం బాలు ఆ పార్టీనివీడి టీడీపీలో చేరారు. వీరికి యరపతినేనితో పాటు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ గడిపూడి చెన్నయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చెన్నయ్యతోపాటు మరో 30 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. అలాగే కట్టెల అడితి సెంటర్లో 10 కుటుంబాలు, ఎస్సీ కాలనీకి చెందిన 30, 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళి అనిత నీలంరాజు ఆధ్వర్యాన 50, మండలంలోని సమాధానం పేటకు చెందిన ఉప సర్పంచ్ కటికల అక్కులుతో పాటు 40 కుటుంబాలు, గంగవరం నుంచి 10, గోగుల పాడుకు చెందిన 10, మాడుగుల ఎంపీటీసీ గనిపల్లి వలిబాసా మేలుతో పాటు 30 ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు, ఓసీ కుటుంబాలు 10, చర్లగుడిపాడునుంచి మరికొన్ని కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే జంగమహేశ్వరపురం అభివృద్ధి

టీడీపీ హయాంలోనే జంగమహేశ్వరపురం అభివృద్ధి చెందిందని గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కూటమి అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ 1999 జనవరి 26వ తేదీన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమంలో జంగమహేశ్వరపురంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. గ్రామంలోని ప్రజలు చంద్రబాబునాయుడు దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారన్నారు. గ్రామంలోని సమస్యలను చంద్రబాబునాయుడు పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేశార న్నారు. 2014, 2019 హయాంలోనూ గ్రామంలో మరెన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామంలోని 500 మందికి ప్రతి ఒక్కరికి 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటా యిస్తానని హామీనిచ్చారు. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా మన్నారు. ఈనెల 22వ తేదీన తాను నామినేషన్ వేయనున్నానని, గురజాల నియోజవకవర్గం నుంచి 50 వేల మందితో నామినేషన్‌కు వెళ్తున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. తనతో పాటు నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.





మాడుగులలో ఎంపీటీసీ వలిబాసామేలును, గడిపూడి చెన్నయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న యరపతినేని, జంగా

బీసీ డిక్లరేషన్ అమలుచేసి తీరుతాం

● ఈ ఐదేళ్లలో బీసీలకు వైసీపీ చేసిందేమీ లేదు

● బీసీల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉంది

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్



టీడీపీలో చేరినవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఏప్రిల్ 19 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్‌ను అమలుచేసి తీరుతామని పెదకూరపాడు నియోజ కవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ స్పష్టంచేశారు. శుక్రవారం క్రోసూరులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో వివిధ గ్రామా ల్లోని వైసీపీకి చెందిన బీసీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. టీడీపీకి బీసీలే వెన్నుముకని, వారికి టీడీపీ ఎంతో రుణపడి ఉందన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 34శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని, దీంతో 16,800 మంది బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 34శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, ప్రత్యేక రక్షణ చట్టం, సబ్ ప్లాన్ ద్వారా ఐదు సంవత్సరాల్లో రూ 1.50 లక్షల కోట్ల నిధులు, ఉపాధికి ప్రోత్సాహకాలు, బీసీలకు శాశ్విత కుల ధ్రువీకరణ పత్రం, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణాలు వంటి వాటిని చేపట్టి వంటివాటిని అమలుచేయనున్నట్లు ప్రవీణ్ తెలిపారు.

వైసీపీకి షాక్.. 60 కుటుంబాలు టీడీపీలోకి..

క్రోసూరు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. మండలం లోని మూడు గ్రామాలకు చెందిన 60 వైసీపీ కుటుంబాల వారు ఆ పార్టీని వీడి శుక్రవారం భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలోని హసానాబాద్‌కు చెందిన 20 కుటుంబాల వారు, అనంతవరం గ్రామానికి చెందిన 35 కుటుంబాల వారు, క్రోసూరుకు చెందిన ఐదు కుటుంబాల వారు సుమారు మూడు వందల మంది ఓటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. భాష్యం ప్రవీణ్ వారి మెడలో టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నేత కంచేటి సాయిబాబు, తోక వెంకటరావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు భాష్యం ఆంజనేయులు, అనంతవరం సర్పంచ్ పీ రామయ్య, హసానాబాద్‌కు చెందిన రామారావు, షేక్ బడా, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

భాష్యం ప్రవీణ్ తరఫున నామినేషన్ దాఖలు..

పెదకూరపాడు : పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తరఫున ఆయన సతీమణి లావణ్య శుక్రవారం ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అలాగే ఆమె అభ్యర్థిగానూ ఒక సెట్ నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములుకు అందజేశారు. ఆమె వెంట సరిపూడి నాగేశ్వరరావు, ఏటుకూరి రత్నకుమార్‌లు ఉన్నారు.

మాదిపాడు పంచాయతీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

అచ్చంపేట : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల గింజుపల్లి తండా, జడపల్లి తండా, కంచుబోడు తండాల్లో నియోజక వర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కుమారుడు భాష్యం అఖిల్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించాడు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



గింజుపల్లి తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం అఖిల్



ఈఆర్వోకి నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న భాష్యం లావణ్య

గిరిజనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

విజయపురిసౌత్, ఏప్రిల్ 19: గిరిజనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ అన్నారు. మాచర్ల మండలం లచ్చంబావితండాలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తాళ్లపల్లికి చెందిన వైసీపీ నేత బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ధారునాయక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, జనసేన అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల : మాచర్ల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి ఎమ్మెల్యేగా తన తండ్రిని గెలిపించాలని బ్రహ్మారెడ్డి కుమారుడు జూలకంటి నాగార్జునరెడ్డి శుక్రవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. తొలుత దళిత మహిళలు సాదరంగా ఆహ్వానించి నాగార్జునరెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగార్జు నరెడ్డిమాట్లాడుతూ టీడపీతోనే సంక్షేమం ఉంటుందని, తాము ఎల్లప్పుడు మీ సంక్షేమం కోసం కృషి చేస్తామని, ఒక్కసారి అవకాశ మిస్తే డాడీ ఏంటో మీకే అర్థమవుతుందని నాగార్జునరెడ్డి ఎంతో వి నమ్రంగా ప్రజలను కోరారు. కార్యక్రమంలో వెంట టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి,లక్ష్మారెడ్డి,దళిత నేతలు కనకయ్య,సంసోన్,పాల్ రాజ్,కాయితి రవి కృష్ణారెడ్డి,పల్లెర్ల లక్ష్మారెడ్డి,బోడపాటి రామకృష్ణ,చే రైడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలు..

పిడుగురాళ్ల, ఏప్రిల్ 19: గురజాల అసెంబ్లీ నియోజకవర్గానికి రెండవ రోజు అయిన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖల య్యాయి. యరపతినేని శ్రీనివాసరావు తరఫున ఒక సెట్ నామినే షన్‌ను తురకా వీరస్వామి దాఖలు చేశారు. యరపతినేని రమేష్ తెలుగుదేశం పార్టీ తరుపున ఒకసెట్ నామినేషన్‌ను దాఖలు చేయడం జరిగింది. స్వతంత్ర అభ్యర్థి కోయ శ్రీరామారావు ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి రమణాకాంత్‌రెడ్డికి అందజేశారు.

సత్తెనపలి : సత్తెనపల్లి నియోజక వర్గానికి స్వతంత్ర్య అభ్యర్థిగా షేక్ దరియావలి నామినేషన్ దాఖలు చేశారని నియోజక వర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

మాచర్లటౌన్ : మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన సోదరి జవ్వాజి నాగమణి, శ్రీనివాస శర్మ, పోలా శ్రీనులతో కలిసి తన నామినేషన్‌ను ఉదయం 11:01 గంటలకు నామినేషన్ అందించారు. పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా తరుపున బచ్చు వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేశారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

విజయపురిసౌత్, ఏప్రిల్ 19: స్థానిక ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద సెబ్ నోడల్ డిప్యూటి కమిషనర్ హేమంత నాగరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేసుల వివరాలను తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే మాచర్ల పట్టణంలోని సెబ్ కార్యాలయానికి చేరుకొని రికార్డులను పరిశీలించారు. మద్యం, నాటుసారా తయారీపై నిఘా పెట్టాలన్నారు. ఆయనవెంట సెబ్ సీఐ కిషోర్, చెక్‌పోస్టు అధికారి రవీంద్రబాబు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని మండల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని ప్రజా వేదికలో శుక్రవారం టీడీపీ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ 6 పథకాలను వివరించాలన్నారు. ఈనెల 22న తన నామినేషన్‌కు కూటమి నేతలు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు గోగినేని కోటేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, కట్టా రమేష్, గొర్రెపాటి సుశీల, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రతిష్ఠలో కార్యక్రమంలో పాల్గొన్న కన్నా..

సత్తెనపల్లి రూరల్: మండలంలోని బృగుబండ గ్రామంలో స్వయంభూగా వెలసిన జగన్నాధస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ఆంజనేయ స్వామి, పోలేరమ్మ తల్లి విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో గ్రామాభివృద్ధి శూన్యం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 19: సీఎం జగన్‌రెడ్డి పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 70శాతం ప్రజలు గ్రామీణప్రాంతాల్లో ఉన్నారని, వారి అభ్యున్నతికి వైసీపీ చేసిందేమీ లేదన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు జీవనోపాధి, మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు. ప్రజలకు సురక్షిత మంచినీటిని అందిం చాలనే సంకల్పంతో సుజల స్రవంతిని ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్య, వైద్యం, రవాణా వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలి పారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లే కనిపిస్తాయన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం పంచాయతీ నిధులను కూడా పక్క దారి పట్టించిందని విమర్శించారు. గ్రామీణ ప్రజల జీవితాల్లో వెలుగులు రావాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బెల్లంకొండ, ఏప్రిల్ 19 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్ర మైన బెల్లంకొండ ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. లావు శ్రీకృష్ణదేవరాయలను, భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ సుభానీ, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పై ప్రజలకు అవగాహన

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బహుళ అంతస్థులు, ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవా ల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రజలను ఎలా రక్షించాలో డెమో ద్వారా తెలియ జేశారు. మాక్ డ్రిల్లును నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు, డాక్టర్లు ప్రశాంతి, రాజేష్, అగ్నిమాపక సిబ్బంది గౌస్, హుస్సేన్, మహేంద్రరెడ్డి, శ్రీనివాసరావు, గోవిందు, సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబటిని ప్రజలు తరిమికొడతారు

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : అంబటి రాంబాబు ప్రజల్లోకి వెళ్ళి ఓట్లు అడిగితే ఆయన బాధితులు తరిమితరిమి కొడతారని, అందుకే ర్యాలీల వంకతో ద్విచక్ర వాహనం పై తిరుగుతున్నాడని టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజక వర్గంలో ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో కన్నా గెలుపు ఖాయం కావటంతో మంత్రి అంబటి రాంబాబు సిగ్గు లేకుండా గతం కంటే మెజార్టీ తగ్గదని మాట్లాడుతున్నారన్నారు. సంక్రాంతి సంబరాల పేరిట వృద్దులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్‌లలో డబ్బులు వసూలు చేసిన అంబటికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమని ఆ పార్టీ నేతలు కొర్రపాటి సురేష్, ఈమని చంద్రశేఖర్, నిజాముద్దీన్, పాలపర్తి రాము, ప్రసాదు, మల్లాల లక్ష్మీనారాయణలు అన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

సత్తెనపల్లి, ఏప్రిల్ 19 : పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద శుక్ర వారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో తుళ్ళూరి నరసింహారావు, కంటు వెంకట్రామయ్య, పత్తిపాటి హరేకృష్ణ, కొమెర పాపారావు, అంకమరావు, తుళ్ళూరి బాల చెన్నయ్య, రమేష్ బాబు, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



అభయాంజనేయస్వామి విగ్రహం

మాచవరం, ఏప్రిల్ 19: మండలంలోని వేమవరం గ్రామంలో శుక్రవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. సుమారు రూ.21 లక్షల వ్యయంతో 31 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి

మాచర్ల రూరల్, ఏప్రిల్ 19: ఇండియా కూటమి మాచర్ల నియో జకవర్గ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డిని గెలిపించుకుందా మని సీపీఎం ఏరియా కార్యదర్శి బండ్ల మహేష్, సీపీఐ (ఎం.ఎల్) నేత అబ్రహం లింకన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇండియా కూటమి నేతల నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకా లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో గాదె పుల్లారెడ్డి, గజ్జల చెన్నకేశవ, నాగేటి ఏడుకొండలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

జగన్ పాలనలో కుంటుపడిన గ్రామాభివృద్ధి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 19: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో 70 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో ఉన్నారని, అందుకు తెలుగుదేశం గ్రామాల అభివృద్ధికి విరివిగా నిధులు ఇచ్చిందన్నారు. 2014 నుంచి 2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అనేక పథకాలతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు జీవనోపాధి, మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు. తద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలనే దృఢ సంకల్పంతో సుజల స్రవంతిని ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలలో రవాణా వ్యవస్థ సులభతరంగా ఉండేందుకు అప్పటిమంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విస్తృతంగా రోడ్డు నిర్మాణాలు చేపట్టారన్నారు. విద్య, వైద్యం, రవాణా వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. ఏ గ్రామంలో చూసినా ఆ రోజు టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లే కనిపిస్తాయన్నారు. అలాగే డ్రైనేజీలు, అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు అత్యధికంగా నిర్మించినట్టు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాలలో అభివృద్ధి చేయకపోగా, సర్పంచులకు వచ్చిన నిధులు పక్కదారి పట్టించారని విమర్శించారు. మళ్లీ గ్రామాలు అభివృద్ధి కావాలంటే తెలుగుదేశం రావాలన్నారు



డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరించి బొకే అందిస్తున్న టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

డాక్టర్ చదలవాడను కలిసిన కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 19: పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా నరసరావుపేటలో నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిశారు. ఈ సందర్భంగా అరవిందబాబును శాలువా కప్పి సత్కరించి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ కూటమి గెలుపును ఆపడం ఎవరితరం కాదన్నారు. మరో 23రోజులలో జరిగే ఎన్నికల యుద్ధంలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని, గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టేవరకు అండగా ఉంటాన్నారు. ప్రజల కోసం పనిచేసే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లాంటి నాయకుడు ప్రస్తుతం పల్నాడు ప్రాంతానికి అత్యవసరం అన్నారు.

నరసరావుపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి నామినేషన్

నరసరావుపేట, ఏప్రిల్ 19: నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో పీ సరోజకు ఒక సెట్ నామినేషన్ పత్రాలను గోపిరెడ్డి అందజేశారు. అయన వెంట డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, షేక్ హనీఫ్ ఉన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 19: మండలంలోని నలగార్లపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి తిరునాళ్ళ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. చిన్నారులు మొక్కుబడి ప్రభలను నిర్మించారు.



గొట్టిపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి శరత్

ఎన్నికల ఫలితాలపైనే యువత భవిష్యత్తు

● ప్రత్తిపాటి శరత్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 19 : ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికల ఫలితాలపైనే యువత భవిష్యత్ ఆధారపడి ఉందని, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తండ్రి ప్రచార బాధ్యతను భుజాన వేసుకున్న ఆయన శుక్రవారం నుంచి ప్రచారం ప్రారంభించారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడులోని ఆలయంలో పూజలు నిర్వహించి తండ్రికి మద్దతుగా ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలు జగన్, చంద్రబాబుల మధ్యనో, ప్రత్తిపాటి, కావటి మధ్యనో కాదన్నారు. ఎవరికి ఓటు వేస్తే రాష్ట్రం, చిలకలూరిపేట భవిష్యత్ బాగుంటుందో ప్రతి ఒక్కరు ఆలోచించి ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. సూపర్-6 పథకాలను వివరిస్తూ చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలకు వివరించారు. గత నెలలో బొప్పూడి సభ ప్రభంజనంతో చిలకలూరిపేట టీడీపీకి ఉన్న ఆదరణ దేశం మొత్తం చూపించామన్నారు. అదేస్ఫూర్తితో మే13న జరగనున్న ఎన్నికల్లో పల్నాడు గడ్డపై పసుపు జెండాను రెపరెపలాడించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట స్థానం నుంచి లావు శ్రీ కృష్ణ దేవరాలయలకు సైకిల్ గుర్తు పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 19: పట్టణానికి చెందిన హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ సహకారంతో గత వారం రోజుల నుంచి పల్నాడు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని పనసతోట, నిమ్మతోట తదితర ప్రాంతాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, లివర్, కిడ్నీ, బీపీ, షుగర్ వ్యాధుల నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందించారు. ట్రాన్స్‌జండర్, ఎంఎస్ఎం, ఎస్ఎస్‌డబ్ల్యూ కమ్యూనిటీకి, ఇతర అన్నివర్గాల వారికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శిబిరంలో ముత్తూట్ ఎం జార్జ్ వైద్య సిబ్బంది, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని శ్రీ దత్తా సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో, ఫువ్వాడ వైద్యశాలలోని సిబ్బందికి ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి ఎం వీ సుబ్బారావు, సిబ్బంది శ్రీనివాసరావు, శేఖర్, సతీష్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట రెండు ఆస్పత్రుల్లో...

చిలకలూరిపేట, ఏప్రిల్ 19 : పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న రేణుక పిల్లల ఆస్పత్రి, శ్రీ కృష్ణ నర్సింగ్ హోమ్‌లలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని స్థానిక అగ్నిమాపక కేంద్రం వారు నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన అత్యవసర చర్యల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూసల వెంకట్, డాక్టర్ జాష్టి రమ్యకృష్ణ, ఫైర్ ఆఫీసర్ ఎస్ కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 19: శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. టౌన్-2 పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, కుమ్మరి కాలనీ, కొత్త మార్కెట్ యార్డు, ఏఎంజీ డొంక, పాత మార్కెట్ యార్డు, గుంటూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తారని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోరాటం

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు, రాణి రుద్రమదేవి

వినుకొండ టౌన్, బొల్లాపల్లి, ఏప్రిల్ 19: రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అభివృద్ధికి, అరాచకం మధ్య పోరాటమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. బొల్లాపల్లి మండలంలోని గరికపాడులోని వైసీపీ నుంచి 30 కుటుంబాలు, గ్రామ ఉప సర్పంచ్ ప్రభుదాసుతో పాటు మరికొన్ని కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా గురువారం జీవీ ఆంజనేయులు, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయులు తండ్రి లావు రత్తయ్య, ఎంపీ సోదరి రాణిరుద్రమదేవి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్‌లు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి వైపా, అరాచకం వైపా ఎటు నిలబడాలో ప్రజలే వివేకంతో ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ పదేళ్ళ ప్రయాణంలో తెలుగుదేశం, వైసీపీ పాలన ఈ రెండు ప్రభుత్వాల హయాంలో రాష్ట్రం అభివృద్ధి ప్రాజెక్టులు జీవన స్థితిగతులు, ధరలవంటి అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బొల్లాపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గోవింద నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, దాసరి కోటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. ఆదేవిధంగా నడిగడ్డ గ్రామం నుంచి వైసీపీని వీడి 15 కుటుంబాలు, పట్టణంలోని వినుకొండ పట్టణంలోని సుందరయ్య, మిద్దెబావికాలనీలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఒకేసారి 60 కుటుంబాలు వైసీపీకి వీడ్కోలు పలికారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆంజనేయులు కుమారుడు హరీష్ పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ పథకాలను వివరిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులుతోపాటు కృష్ణదేవరాయులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఆయన వెంట జనసేన జిల్లా కార్యదర్శి నిశంకరర శ్రీనివాసరావుతో పాటు మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వినుకొండ ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు కుమారుడు హరీష్

రాముడుపాలెం తండా, జేసీ నగర్‌లలో టీడీపీ, జనసేన ప్రచారం

నూజెండ్ల, ఏప్రిల్ 19: మండలంలోని రాముడు పాలెం తండా, జేసీ నగర్‌లలో వినుకొండ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్, జనసేన నేత కొణిజేటి నాగశ్రీనులు టీడీపీ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం ద్వారా భవిష్యత్ గ్యారెంటీ ఉంటుందని, రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ ప్రవేశపెట్టే పథకాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ, బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్, బొట్ల అంజయ్య, బత్తుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల కేసుల్లో ఒకరు అరెస్టు

రూ.30 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 19: చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడిన ఒక వ్యక్తిని శుక్రవారం చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.30 లక్షలు విలువైన 42 సవర్ల బంగారంతో ఒక మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం తొమ్మిది కేసులకు సంబంధించిన సొత్తును చిలకలూరిపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు చూపారు. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన గుడిపాటి వీరాంజనేయులు (వీరాంజి) (32)గా గుర్తించారు. గత నెల 3వ తేదీన నాదెండ్ల మండలం గణపవరంలో బత్తుల అన్నపూర్ణ అనే మహిళ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆ ఇంట్లో బంగారు చైను, బంగారు ఉంగరాలు, చెవి బుట్టలు ఇంటి తాళం పగల గొట్టి అతడు దోచుకు వెళ్ళినట్టుగా పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ వర్మ పర్యవేక్షణలో సాంకేతికత ఆధారంగా ముద్దాయిని గుర్తించి గణపవరం సెంటర్‌లో అరెస్టు చేయటం జరిగింది. శావల్యాపురం పోలీసు స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఒక మోటారు సైకిల్‌ను కూడా ముద్దాయి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

చోరీ సొత్తుతో విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ఇతడు తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్టుగా దర్యాప్తులో తేలింది. అతడిపై గతంలో 25 కేసులు నమోదై ఉన్నట్టుగా కూడా తేలింది.

చిలకలూరిపేట రూరల్ సీఐ పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ సర్కిల్ ఎస్ఐలు బాల రామిరెడ్డి, రవి కృష్ణ, బాలకృష్ణ, రాజీవ్ శామ్యూల్, ఏఎస్ఐ రోసిబాబు తదితరులు ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న 'సాగర్ జలాలు'

● పంట పొలాలకు తరలిస్తున్న తాగునీరు
● చోద్యం చూస్తున్న అధికారులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 19: నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నెల 8వ తేదీన అధికారులు నీటిని విడుదల చేశారు. మేజర్ కాల్వల ద్వారా సమీపంలోని తాగునీటి చెరువులకు నీటిని నింపాల్సి ఉంది. కాని అధికారులు కాల్వపై శ్రద్ధ చూపకపోవడంతో కొందరు నీటిని అక్రమంగా పంట పొలాలకు తరలిస్తున్నారు. కొప్పుకొండమేజర్ కాల్వ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తే గతంలో కాల్వల్లో వేసిన అడ్డీలు కారణంగా నీరు దిగువకు చేరని పరిస్థితి నెలకొని ఉంది. ఇదిలా ఉండగా మేజర్ పరిధిలోని సాగులో ఉన్న పండ్ల తోటల యజమానులు కాల్వ నీటిని అక్రమంగా మళ్ళించేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో ఉన్న తూములను తొలగించి నీలగంగవరంకు నీళ్ల వెళ్ళాలంటూ కొందరు నీటిని మళ్లిస్తున్నారు. ఇదిలా ఉండగా సోలార్ ప్లాంట్ సమీపంలో ఏకంగా కాల్వకు ప్రొక్లయిన్ సాయంతో మట్టిని అడ్డువేసి పంట పొలాల్లో తీసిన అక్రమ చెరువులకు నీళ్ల తరలించేందుకు తోట యజమానులు యత్నిస్తున్నారు. పెరుమాళ్లపల్లి కాల్వకు పొక్లెయిన్ సాయంతో నీరు దిగువకు చేరకుండా కట్టవేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేజర్ పరిధిలోని తాగునీటి చెరువులకు నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని మేజర్ పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై యన్ఎస్‌పీ ఈఈ ప్రేమ్‌కుమార్‌ను వివరణ కోరగా కొప్పుకొండ మేజర్‌కు నీరు సరఫరా కాలేదని, ఒకవేళ అయితే మేజర్ పరిధిలోని నడిగడ్డ చెరువుకు తాగునీరు ఇవ్వాల్సి ఉందని మా సిబ్బంది కాల్వపై ఏర్పాటుచేసిన అక్రమ తూములను తొలగించి చెరువులు నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా కాల్వ నీటిని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



అడ్డీలతో కాల్వలో ముందుకు కదలని నీరు, పొలాలకు నీళ్ళను మళ్ళిస్తున్న స్థానికులు



దిగువకు నీరు వెళ్లకుండా కాల్వకు అడ్డంగా వేసిన మట్టికట్ట

చిలకలూరిపేటలో వలంటీర్ల రాజీనామాలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 19: చిలకలూరిపేట పట్టణం, మండలంలో పలువురు వలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. పట్టణ పరిధిలోని 29 సచివాలయాల్లో మొత్తం 533మంది వలంటీర్లు ఉండగా వారిలో ఇప్పటి వరకు 40 మంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. చిలకలూరిపేట మండల పరిధిలో ఉన్న 15 సచివాలయాల పరిధిలో 283మంది వలంటీర్లు ఉండగా 21 మంది తమ పదవులకు రాజీనామా చేశారు. ఐతే వలంటీర్ల పై ఒత్తిడిచేసి వైసీపీ నేతలు రాజీనామాలు చేయిస్తున్నారంటున్నారన్నారు. చాలామంది వలంటీర్లు రాజీనామా చేయటానికి ఇష్టపడటం లేదు. ఐతే వైసీపీ నాయకులు వలంటీర్లకు ఫోన్‌లు చేసి మెసేజ్‌లు పెట్టి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామాలు చేసిన వారికి వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని వారు హామీ ఇస్తున్నట్టుగా సమాచారం. చాలామంది వలంటీర్లు ఈ విషయంపై తర్జన భర్జన పడుతూ మొఖం చాటేస్తున్నారు. కాగా వలంటీర్ల రాజీనామాకు సంబంధించి తెలుగుదేశం పార్టీ వారు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. వలంటీర్లను రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజీనామాలు చేసిన వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా పెట్టుకోకుండా చూడాలని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిలకలూరిపేటలో ఒక నామినేషన్ దాఖలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 19: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజక వర్గ పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా తన్నీరు రత్నకుమారి శుక్రవారం నియోజక వర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బీ నారధమునికి నామినేషన్ అందజేశారు. రెండో రోజున ఆమె ఒక్కరే నామినేషన్ వేయటం జరిగింది. దీంతో రెండు రోజులుగా మొత్తం రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి.

కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణకు బీఫాం

చిలకలూరిపేట, ఏప్రిల్ 19: చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించిన పట్టణానికి చెందిన ఎం రాధాకృష్ణ శుక్రవారం బీ ఫారం అందుకున్నారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో రాధాకృష్ణ ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల వద్ద నుంచి బీ ఫారాన్ని అందుకున్నారు. ఆయన ఈ నెల 24వ తేదీన తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారని తెలిసింది.

రేపు కారుచోల కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

యడ్లపాడు, ఏప్రిల్ 19: మండలంలోని కారుచోలలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయం ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 19నుంచి 21వరకు ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా తొలిరోజైన శుక్రవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య యాగశాల ప్రదక్షిణ, ప్రవేశం, మండపారాధన పూజాకార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. అంతేగాకుండా అగ్నిప్రతిష్ఠాపన, నారాయణ, రామతారక హోమాలను జరిపించారు. కాగా శనివారం ప్రతిష్ఠమూర్తులతో గ్రామ ప్రదక్షిణ, సుదర్శన, నారాయణ హోమాలు ఉంటాయన్నారు. మూడో రోజైన ఆదివారం కోదండరాముడు, సర్వదేవతల ప్రతిష్ఠలు, మధ్యాహ్నం 12గంటలకు సీతారాముల శాంతి కల్యాణం ఉంటాయన్నారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రతిష్ఠా కార్యక్రమాలలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడమే 'ప్రేరణ' లక్ష్యం

● డీవై ఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 19: విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్రీయ విద్యాలయాల్లో ప్రేరణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గుంటూరు డిప్యూటీ డీఈవో పి.వెంకటేశ్వరరావు అన్నారు. నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ సూచనల మేరకు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో ఉన్న వెర్నాక్యులర్ స్కూల్‌లో ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్యార్థుల తుది ఎంపిక కోసం శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రేరణ ఉత్సవం-2024లో జిల్లాలోని 60 పాఠశాలల నుంచి 120మంది విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమన్నారు. ప్రేరణ ఉత్సవం భారతదేశం కోసం నా విజన్, వికసిత భారత్ 2047, ప్రేరణ ఉత్సవానికి 'నన్ను ఎందుకు ఎంపిక చేయాలి' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, కవిత, డ్రాయింగ్‌లను ప్రదర్శించేలా ప్రోత్సహించారు. తుది ఎంపికలో న్యాయమూర్తుల ప్యానెల్ వ్యక్తిగత ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపికచేసి, ఎంపికైన వారి వివరాలను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసన్న, ఉపాధ్యాయులు సునీల, హెచ్ఎం ఎస్.ఆనంద్ పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

రైతు ఆత్మహత్యలన్నీ

జగన్ ప్రభుత్వ హత్యలే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో గడిచిన ఐదు సంవత్సరాలుగా చోటు చేసుకున్న రైతు ఆత్మహత్యలన్నీ జగన్ ప్రభుత్వ హత్యలేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే టీడీపీ కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే మూడో స్థానంలో కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో నిలిపిన దుర్మార్గపు పాలన జగన్ ఏలుబడి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వైసీపీకి చెందిన పార్టీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పట్టణానికి చెందిన 80 కుటుంబాలతో పాటు మండలంలోని గంగన్నపాలెంకు చెందిన 50 కుటుంబాలు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆర్‌కే వెల్డింగ్స్ అధినేత షేక్ కరిముల్లా, స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో చాగంటి సాంబశివరావు, గింజుపల్లి వీరవసంతరావు, కోమటినేని నాగ మల్లేశ్వరరావు, మద్దుకూరి మణికంఠ, సామినేని వెంకటేశ్వర్లు, దాసరి సుబ్బారావు, మద్దుకూరి సాంబయ్యలతో పాటు 50 కుటుంబాలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో సైకిల్ జోరు పెరిగిందని, వైసీపీకి ఘోర పరాభవం తప్పదన్నారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, రైతులను తీవ్ర సంక్షోభంలో నెట్టిన పాపానికి జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వైసీపీ పాలనలో రైతుల జీవితాలు గాలిలో దీపంలా మారాయని, ప్రతి రైతు కుటుంబం నెత్తిన రూ.2.45 లక్షలకు పైగా అప్పులు అయ్యాయన్నారు. జాతీయ సగటు ఆదాయం కంటే రైతులపై రెండు రెట్లకు పైగా రుణభారం ఉందని, ఇందుకు వైసీపీ, రైతు వ్యతిరేక విధానాలే కారణమన్నారు. తుఫాన్‌లు, వరదలు, కరువు వంటి విపత్తుల సమయంలో కూడా కొద్ది మందికే పరిహారం అందించారని, పంట నష్ట పరిహారాన్ని కూడా కొందరు వైసీపీ నేతలు రైతుల ముసుగులో దోచుకున్నారని ప్రత్తిపాటి ఆరోపించారు. ఈ పరిస్థితుల్లోనే సాగు భారమై అప్పులు తీర్చే మార్గం లేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఈ రైతు హంతక ప్రభుత్వాన్ని సాగనంపటానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి పిలుపునిచ్చారు.



బాలాజీ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

బాడుగ పెంచాలంటూ లారీ ఓనర్ల నిరసన

వినుకొండ, ఏప్రిల్ 19: పెరిగిన రేట్లకు అనుగుణంగా లారీల బాడుగలు పెంచాలంటూ పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని బాలాజీ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి తమ ట్రాన్స్‌పోర్టు నుంచి లారీలు నిలిపివేసినట్లు వారు తెలిపారు. మార్కెట్‌లో పెరిగిన డీజిల్, టోల్‌ట్యాక్స్ వివిధ పన్నులు అలాగే లారీ డ్రైవర్లు, క్లీనర్‌కు సైతం జీతాలు అమాంతంగా పెరిగినప్పటికి లారీల బాడుగుల మాత్రం పెరగడం లేదని, మిల్లర్స్‌తో మూడేళ్లుగా ఒప్పందంలో ఉన్న తమ యూనియన్ కరోనా సమయంలో ఒప్పందం ప్రకారం ధరలు పెరిగినప్పుడు లారీలు నడిపామని ప్రస్తుతం ఆ భారాన్ని మోయలేక లారీలను నిలిపివేసినట్లు వారు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా లారీలకు బాడుగుల కూడా పెంచాలని మిల్లర్లను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు, సెక్రటరీ ఎస్‌కే హుస్సేన్‌వలి, ఓనర్స్ చంద్రశేఖర్, అనంతరామిరెడ్డి, నాని, పేరయ్య సత్యనారాయణ, రఫీ, సుభాని, నాగుల్‌మీరా, శ్రీను, మస్తాన్‌వలి, మాధవ, రాజు, వెంకటేశ్వర్లు, బాష, కరిముల్లా, సుబాని, మీరావలి తదితరులు పాల్గొన్నారు.



ఓ ప్రైవేటు వైద్యశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వినుకొండ టౌన్, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు ప్రైవేటు వైద్యశాలల నందు ప్రమాదాల నివారణపై శిక్షణ ఇచ్చారు. ప్రమాద సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు గురించి ఫైర్ అధికారి నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ప్రకాష్, రమణారెడ్డి, ప్రభాకరరెడ్డి, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, రామకృష్ణ, డాక్టర్స్ మాధవరావు, డాక్టర్ నీలిమ, డా.గోపు చిన్నప్పరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగుల సేవా సంఘం కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న సేవా సంఘం సభ్యులు

ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

వినుకొండ, ఏప్రిల్ 19: నర్సరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 9సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శేషయ్య, సూరి, పి.శేషయ్య, నారాయణరావు, ఏ.నాగేశ్వరరావు, వైవీ సుబ్బయ్యశర్మ, ఎంవీ శర్మ, శంకరరావు, రాము, కోటేశ్వరరావు, నాగేంద్రుడు, డి.దాసు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓట్లు వేయండి: గోపిరెడ్డి

రొంపిచర్ల, ఏప్రిల్ 19: అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రొంపిచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మరేరాష్ట్రంలో జరగలేదని పేర్కొన్నారు. చెరువు కట్ట సెంటర్ నుంచి ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.